క్లుప్తంగా

దేవాలయ అభివృద్ధికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న పొన్న రాజీవ్‌రెడ్డి

షాబాద్: దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని మల్లన్న దేవాలయ కమిటీ సభ్యులు పొన్న సుధాకర్‌రెడ్డి, దోనూరు గోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న దేవాలయానికి తనవంతు ఆర్థిక సహాయంగా నాన్‌ంధార్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన పొన్న రాజీవ్‌రెడ్డి రూ.50వేల చెక్కును విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు సుధాకర్‌రెడ్డి, దోనూరు గోపాల్, శంకరయ్య, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, లింగం తదితరులు ఉన్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి

షాబాద్: రైతులు మూగజీవాలకు పారుడు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు ప్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేసారం, షాబాద్ గ్రామాల్లో సిబ్బందితో కలిసి మూగజీవాలకు పారుడు వ్యాధి టీకాలు వేశారు. రైతులు తప్పనిసరిగా తమ వద్ద గల మూగజీవాలకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు ఉన్నారు.

రహదారి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో నాలుగు లేన్ల రోడ్డు ఎన్‌హెచ్‌ఏఐ రహదారి పనులు అజీజ్‌నగర్ సమీపంలో కాంట్రాక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని అప్పా మొదలుకొని మృగవాణి వద్ద కొనసాగుతున్న పనులను బీజేపీ రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి, మోర నర్సింహారెడ్డి, అజీజ్‌నగర్ మాధవరెడ్డి తదితరులు కలిసి పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. హైదరాబాద్ అప్పా జంక్షన్ మొదలుకొని మన్నెగూడ చౌరస్తా వరకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ద్వారా నాలుగు లేన్ల రోడ్డు విస్తరణలోకు భాగంగా నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఈ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాధవరెడ్డి, జ్ఞానేశ్వర్, ఎన్మెపల్లి దానయ్య, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారికి నివాళి

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి ప్రాణత్యాగమే మలిదశ ఉద్యమానికి ప్రాణం పోసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అమరవీరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, వైస్ చైర్మన్ బాబర్‌అలీఖాన్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, నాయకులు రఘునాయక్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, విశ్వం, ఎండీ.ఇబ్రహీం, సర్వర్‌పాషా, గంగాధర్, బస్వం, తిరుపతిరెడ్డి చెన్నయ్య, జమ్మద్‌ఖాన్, శివశంకర్‌గౌడ్, కరుణాకర్, ముబారక్, నర్సింలు, భాస్కర్, ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని మహల్‌ఎలికట్ట గ్రామానికి చెందిన వీఓఏ స్వప్న అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకుంది. గత నెలరోజులుగా ఇంట్లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటోంది. ఈ విషయం తెలుసుకున్న వీఓఏల సంఘం నాయకులు మంగళవారం స్వప్న కుటుంబానికి రూ.10వేల నగదు, క్వింటాల్ బియ్యం, నిత్యావసర సరుకులు, ఎలికట్ట మాజీ ఎంపీటీసీ శ్రీశైలం తనవంతుగా రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు మొయినొద్దీన్, వీఓఏలు రాజు, మల్లేశ్, లక్ష్మి, సుజాత, అమరావతి, సుమిత్ర, సుజాత, లావణ్య, సరిత, రేష్మ,మమత, సరోజ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా 2కే రన్ నిర్వహణ
- పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు



షాద్‌నగర్‌రూరల్: జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌రూరల్: 2కే రన్‌లో మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న కమ్మదనం గురుకుల విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మినీ స్టేడియంలో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. మినీ స్టేడియంలో ప్రారంభమైన 2కే రన్ ముఖ్యకూడలి మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు కొనసాగింది. 2కే రన్‌లో కమ్మదనం గురుకుల పాఠశాల విద్యార్థినుల మార్చ్ ఫాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందిరా మహిళా శక్తి యూనిట్‌లో భాగంగా పట్టణంలోని పటేల్‌రోడ్డులో ఏర్పాటు చేసిన అక్షయ ఫ్యాన్సీ స్టోర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా పట్టణంలోని అయ్యప్ప కాలనీలో అమృత్-2లో భాగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు రుణాలను అందజేశారు. మున్సిపల్ కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి హెల్త్ కిట్లను అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్మికులతో ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకు గ్యాస్ సిలిండర్‌ను అందిస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడంతో పాటు బోనస్‌ను అందిస్తూ.. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, వైస్ చైర్మన్ బాబర్‌అలీఖాన్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, శ్రీనివాస్, పట్టణ సీఐ విజయకుమార్, నాయకులు రఘునాయక్, విశ్వం, ఎండీ.ఇబ్రహీం, బస్వం, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, జమ్మద్‌ఖాన్, శివశంకర్‌గౌడ్, కరుణాకర్, ముబారక్, నర్సింలు, యాదగిరియాదవ్, హరినాథ్‌రెడ్డి, భాస్కర్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

శంకర్‌పల్లి: ప్రజలందరూ మారుతున్న కాలానికి, ఆహారపు అలవాట్ల కారణంగా తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేందర్‌బాబు, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం శంకర్‌పల్లి పట్టణ చౌరస్తా నుంచి బీడీయల్ చౌరస్తా వరకు 2కే రన్, కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి నిత్యం ఉదయం లేవగానే అరగంట పాటు వ్యాయామం చేయాలని సూచించారు. దీంతో మెదడు చురుకుగా పనిచేయడంతో పాటు, రోజంతా ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: శంకర్‌పల్లి చౌరస్తాలో 2కే ప్రారంభోత్సవంలో పాల్గొన్న చైర్‌పర్సన్, కమిషనర్

కొత్తూరులో..

కొత్తూరు: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం కొత్తూరు మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఆధ్వర్యంలో సిబ్బంది, నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ వైద్యులతో సిబ్బందికి వైద్య పరీక్షలు చేపట్టారు. అనంతరం మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ డోలి రవీందర్, కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్లు, నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: ర్యాలీ నిర్వహిస్తున్న చైర్‌పర్సన్, మున్సిపల్ సిబ్బంది

హామీల అమలులో విఫలం



డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు లేవు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్

మొయినాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్కరికి కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు ఇవ్వలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడం లేదంటూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మొయినాబాద్ మండల కేంద్రం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదని విమర్శించారు. గ్రామాల్లో అర్హులైన పేదలకు కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. రైతు భరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అన్ని గ్రామాల రోడ్లు అభివృద్ధి చేయడంతో పాటు మొయినాబాద్ మండలంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'అబద్ధాలతో మోసం చేస్తున్న కాంగ్రెస్'

షాబాద్: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సీనియర్ నాయకుడు పీసరి సతీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి నిరసన తెలిపారు. అనంతరం షాబాద్ డిప్యూటీ తహసీల్దార్ మధుకు కాంగ్రెస్ హామీలు-వైఫల్యాలపై చార్జ్‌షీట్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో చార్జీషీట్ విడుదల చేశామన్నారు. కాంగ్రెస్ హామీలు-వైఫల్యాలపై అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చార్జీషీట్ విడుదల చేస్తామని, బైక్ యాత్రలు చేపట్టి ప్రజాక్షేత్రంలో తప్పులను ఎండగడతామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన పాపాలు కాంగ్రెస్ సర్కారు ఒక్క ఏడాదిలోనే మూటగట్టుకుందన్నారు. ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ నాయకులను అడుగడుగునా నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, నాయకులు మాణెయ్య, పొన్న రాజీవ్‌రెడ్డి, లింగాల మహేందర్, రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

సీఎం కప్ క్రీడలకు రిజిస్టర్ చేసుకోండి

కొత్తూరు: త్వరలో జరగనున్న చీఫ్ మినిస్టర్ కప్ క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 7, 8వ తేదీల్లోపు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని ఎంపీడీఓ అరుంధతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, ఖోఖో, యోగాతో పాటు పలు క్రీడల్లో పాల్గొనేవారు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

వరినారు మడులను కాపాడుకోవాలి

కొందుర్గు: ప్రస్తుతం రైతులు యాసంగి సీజన్‌లో వరి సాగుచేసేందుకు నారు మడులను సిద్ధం చేస్తున్నారని, పలు జాగ్రత్తలు తీసుకుంటే వరినారు ఏపుగా పెరుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ప్రతీ వారం వివిధ పంటల సాగుపై శాస్త్రవేత్తలు ఎలక్ట్రానిక్ ద్వారా రైతులకు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఆన్‌లైన్ వీడియో పాఠాలను కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో రైతులు వీక్షించారు. చలి తీవ్రతతో వరినారు ఎరుపుగా మారే అవకాశం ఉంటుందని, ఇందుకోసం రైతులు దుక్కిలోనే జిప్సం వేసుకోవాలని సూచించారు. నారు ఎరుపు రంగులోకి మారితే జింక్ సల్ఫేట్ పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు అడిగిన సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏఓలు సురేశ్, రాజేందర్‌రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటాం

షీటీం హెడ్‌కానిస్టేబుల్ బిచ్చయ్య

షాద్‌నగర్‌రూరల్: అపరిచిత వ్యక్తుల నుంచి ఇబ్బందులు, వేధింపులు ఎదురైనప్పుడు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని షీటీం హెడ్ కానిస్టేబుల్ బిచ్చయ్య విద్యార్థినులకు సూచించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం పరిధిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో షీటీం బృందం ×గుడ్ టచ్-బ్యాడ్ టచ్÷పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిచ్చయ్య మాట్లాడుతూ.. మహిళలు, బాలికలకు పూర్తి రక్షణ ఇవ్వడమే షీటీం కర్తవ్యమన్నారు. విద్యార్థినులు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగితే లక్ష్యాలను చేరుకుంటారన్నారు. చిన్న వయసులో వివాహం చేసుకోకుండా ఉన్నత విద్యనభ్యసించాలని సూచించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ వంటి రద్దీ ప్రాంతాల్లో ఆకతాయిలు మహిళలు, బాలికలను ఇబ్బందులకు గురిచేస్తే వారి వివరాలను తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. అత్యవసర సమయాల్లో 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు వెంటనే చెప్పాలని సూచించారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారిపేర్లు బయట పెట్టకుండా గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ విద్యుల్లత మాట్లాడుతూ.. ప్రధానంగా అమ్మాయిలు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మన ఫొటోలు, వీడియోలు ఇతరులకు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం కానిసేబుళ్లు సురేశ్, కృష్ణ, వెంకటేశ్, భార్గవి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'ఆశా'ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలికి వినతిపత్రం అందజేస్తున్న దేవేందర్, ఆశాలు

షాబాద్: ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశల సమస్యలపై వైద్యురాలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశవర్కర్లతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తోందని, పనిభారాన్ని తగ్గించి పెండింగ్‌లో ఉన్న సర్వే బిల్లులను విడుదల చేయాలని, నెలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలన్నారు. గతంలో ఆశలకు ఇచ్చిన హామీలను నేటివరకు నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటివరకు ఆశవర్కర్ల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కరించలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 4వ తేదీన కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశకార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



హెడ్ కానిస్టేబుల్ పాండయ్యను సన్మానిస్తున్న ఏసీపీ రంగస్వామి

కేశంపేట: కేశంపేట పోలీస్ స్టేషన్‌ను షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆయన సిబ్బందికి సూచించారు. కేసుల నమోదు, ఎంట్రీ వివరాలపై పలు సూచనలు చేశారు. విధుల్లో చురుగ్గా పనిచేసిన పలువురు సిబ్బందిని ఆయన సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్ఓ నరహరి, ఎస్ఐ రాజ్‌కుమార్, ట్రైనీ ఎస్ఐలు చిన్నారెడ్డి, సాయికృష్ణ, ఏఎస్ఐలు నర్సింలు శెట్టి, శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా స్పందించరా?

- హైదరాబాద్-బీజాపూర్ రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి
- బీఆర్ఎస్ నేతలు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

మొయినాబాద్: హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ప్రజల ప్రాణాలు పోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించవా అంటూ బీఆర్ఎస్ నేతలు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2021లోనే హైదరాబాద్-బీజాపూర్ రహదారి పనులు ప్రారంభమైనా ఇప్పటివరకు చేపట్టడం లేదన్నారు. రోడ్డు పనులు చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసు ఉందని రోడ్డు విస్తరణ పనులు ఆపేస్తే రోడ్డు ప్రమాదాలు జరిగి వేల మంది నిండు ప్రాణాలు పోతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఈ రోడ్డుపై తిరుగుతున్నా వారికి రోడ్డు పరిస్థితి అర్థం కావడంలేదా అని మండిపడ్డారు. అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్లు రవూఫ్, వెంకట్‌రెడ్డి, డప్పు రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు జయవంత్, నాయకులు భాస్కర్, ప్రవీణ్, ఖయ్యూం, అంజద్, రాజు, షరీఫ్, రవి, షఫీ, చిన్న, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు.. రాక్షస పాలన



పాఠశాల ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న టీఆర్ఎస్వీ నాయకులు

- గురుకుల విద్యార్థుల మరణాలు ప్రభుత్వానికి పట్టవా
- ఏడాది దాటినా విద్యాశాఖకు మంత్రి లేడు
- ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడు చిటారి దశరథ్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది ప్రజా పాలన కాదని, రాక్షస పాలన కొనసాగుతోందని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడు చిటారి దశరథ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లిలో గల వివేకానంద కళాశాలలో కొనసాగుతున్న కేశంపేట మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లిన టీఆర్ఎస్వీ నాయకులను పాఠశాల సిబ్బంది అడ్డుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ తీరును నిరసిస్తూ టీఆర్ఎస్వీ నాయకులు పాఠశాల ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని టీఆర్ఎస్వీ నాయకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం చిటారి దశరథ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆరోపించారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు చనిపోతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన మమ్మల్ని పాఠశాల సిబ్బంది అనుమతుల పేరుతో అడ్డుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పాఠశాలలో సమస్యలు బయటపడతాయనే ఆలోచనతోనే సిబ్బంది అడ్డుకుంటున్నారని ఆరోపించారు. విద్యార్థి సంఘం నాయకులుగా విద్యార్థుల సమస్యలను తెలుసుకునే బాధ్యత మాపై ఉందని అన్నారు. గతంలో ఈ పాఠశాల విద్యార్థులను ఎలుకలు కరవడంతో ఆస్పత్రి పాలయ్యారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న కాస్మొటిక్ చార్జీలను ఉపాధ్యాయులే కాజేస్తున్నారనే విషయాన్ని విద్యార్థులే చెబుతున్నారన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలకు అద్దెలు చెల్లించడం లేదని, భవనాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గదులకు కిటికీలు లేక విద్యార్థులు చలికి వణికిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యార్థుల సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని వాపోయారు. గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే వరకు ప్రభుత్వంపై పోరాటాన్ని ఆపేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్వీ నాయకులు శీలం శ్రీకాంత్, గుండు అశోక్, శరత్‌కృష్ణ, రాజశేఖర్, హన్మంతు, శ్రీనివాస్, సత్యం, శేఖర్, సంజునాయక్, ప్రవీణ్, శివ, నవీన్, సాయితేజ, శివనాయక్, జగన్‌నాయక్ పాల్గొన్నారు.

ఔదార్యం చాటుకున్న ఎమ్మెల్యే



స్వీపర్ శ్రీనివాస్‌కు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే

నందిగామ: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న వ్యక్తికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆర్థికసాయం అందజేసి ఔదార్యం చాటుకున్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత గ్రామం మండల పరిధిలోని వీర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. కాగా గతేడాది కాలంగా అతనికి ఎలాంటి వేతనం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్వీపర్ శ్రీనివాస్‌ను తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని రూ.30వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, నాయకులు చిందం నర్సింహ, దేపల్లి కుమార్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.